క్లుప్తంగా

సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



కమలాపూర్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ విడపు ప్రతాప్‌ను ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు నగరంలో శనివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ప్రతాప్‌కు శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వంగరి వేణుగోపాల్, ఎస్.వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్ ఆర్య, పోకల చందర్, వనం గోపాల్‌రావు, కె.సుభాష్, మహేష్, ఆర్.రమణారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పత్తిపాకలో 'మన ఊరు-మన రమణన్న'

శాయంపేట : నేడు (సోమవారం) మండలంలోని పత్తిపాకలో 'మన ఊరు-మన రమణన్న' పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరౌతారని వారు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు గండ్ర దంపతులు పత్తిపాకకు చేరుకొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి సమస్యల గురించి అడిగి తెలుసుకుంటారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సోమేశ్వరాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన



కాజీపేట: కాజీపేట పట్టణ పరిధిలోని సోమిడిలోని సోమేశ్వరాలయంలో పలు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ప్రతిష్ఠ వైదిక నిర్వాహకులు ఐనవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో నాగేంద్రస్వామి, భక్తాంజనేయస్వామి, నవగ్రహ మూర్తులకు మూలమంత్ర హవనం, పంచగవ్య ప్రాసనం, జలాధివాస, ధాన్యాధివాస పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో విగ్రహ దాతలు సుంచు అశోక్ - కవిత, చింతకుంట ప్రవీణ్‌కుమార్ - స్రవంతి, గ్రామ పెద్దలు సుంచు చంద్రయ్య, శ్రీహరి, పోలు సాంబమూర్తి, పెసర రాజు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

మడికొండ: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ పరిధిలోని మడికొండ అయోధ్యపురం రోడ్డులోని ఎంఎస్ఆర్ నగర్ కాలనీకి చెందిన 15మంది నిరుపేదలకు నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, జీ.రాజు, అనిల్‌కుమార్, సాయిలు, వినయ్, గణేష్ పాల్గొన్నారు.

చేయూత

హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన సీతంపేటకు చెందిన గొల్లె బొందయ్య కుటుంబానికి స్థానిక ఎంపీటీసీ బండారి రజిత చేయూతనందించారు. ఈ సందర్భంగా మృతుడి కుమారులు రాజయ్య, కృష్ణమూర్తి, కుమారస్వామి, తిరుపతిని ఆదివారం పరామర్శించి బియ్యం అందించారు. స్థానికులు బండారి చేరాలు, జంపాల శ్రీనివాస్, రాజయ్య, సారయ్య, రమేష్ పాల్గొన్నారు.

సీహెచ్‌పీఎస్ కమిటీ ఎన్నిక

కాజీపేట అర్బన్: హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో చిందు హక్కుల పోరాట సమితి (సీహెచ్‌పీఎస్) హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా గజవెల్లి రాజు, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా గడ్డం శివకుమార్, ఉపాధ్యక్షులుగా ఏషోబు సుమన్, ఆదమ్, ప్రధాన కార్యదర్శిగా విధూమైళి, కార్యదర్శులుగా సతీష్, కిరిటీ రవి, రమేష్, భూషణం, ప్రభుదాస్, సభ్యులుగా ఆంజనేయులు, సల్మాన్, మంజునాథ్, గౌరవ అధ్యక్షులుగా భిక్షపతి, భూషణం, మధును ఎన్నుకున్నారు.

ఆలయ నిర్మాణానికి కృషి

హసన్‌పర్తి: రజకుల ఆరాధ్య దైవమైన మడేలేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ హామీ ఇచ్చారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలో ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే రమేష్‌ను హనుమకొండలోని ఆయన స్వగృహంలో రజకులు ఆదివారం కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, రజక సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి రాజు, మాజీ అధ్యక్షుడు సదానందం, కనకస్వామి, కుమారస్వామి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



కమలాపూర్ : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పరకాల : కేక్ కట్ చేస్తున్న కొయ్యడ శ్రీనివాస్, తదితరులు

శాయంపేట : దేశానికి ప్రధానిగా రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కొనియాడారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మాజీ దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి బుచ్చిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ప్రధానిగా రాజీవ్‌గాంధీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రపంచంతో పోటీ పడేలా బలమైన పునాదులు వేశారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు ఇచ్చారని, టెక్నాలజీని పరిచయం చేశారని చెప్పారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా చొరవ తీసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిందం రవి, బాసాని మార్కండేయ, వలీ హైదర్, మారెపల్లి రాజు, రఫీ, వీరన్న, భిక్షపతి, శంకర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : స్థానిక బస్టాండ్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుండవు చరణ్ పటేల్, నారాయణరెడ్డి, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు హనుమాన్ ప్రసాద్, నాయకులు పోతిరెడ్డి ఓదెలు, కనకరత్నం, ప్రభాకర్‌రెడ్డి, కిన్నెర కృష్ణమూర్తి, ఆకినపెల్లి భిక్షపతి, మర్రిపల్లిగూడెం భిక్షపతి పాల్గొన్నారు.



శాయంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు

పరకాల : పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంజాన్ అలీ, నాయకులు చందుపట్ల రాజిరెడ్డి, వేణు, అలీ, నాగరాజు, రాజు, సతీష్, శివ, శంకర్, షాబీర్, రాకేష్, సుమన్, చెంగల్, గట్టయ్య, కృష్ణ, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, మలహల్ రావు, చిన్ని, తాళ్ల నవీన్, రవీందర్, ఎల్లయ్య, యుగేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, రవి, దామోదర్, అనిల్, అరుణ్, సురేష్, శంకర్ పాల్గొన్నారు.



నడికూడ : కేక్ కట్ చేస్తున్న దేవేందర్



ఎల్కతుర్తి : నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లోని అంబేడ్కర్ చౌక్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రయాణికులకు, బాటసారులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సభ్యుడు అయిలయ్య, సుదర్శన్‌రెడ్డి, నాయకులు రామచంద్రం, గోపీ, ప్రవీణ్‌రెడ్డి, కేతిరి లక్ష్మారెడ్డి, కొలుగూరి రాజు, భీమ్‌రెడ్డి, ఆదరి రవీందర్, రమేష్, రాజేందర్, కందుగుల రాజు, మాడుగుల కోటి, వల్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో పాలకులు విఫలం

● సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

కమలాపూర్ : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సీపీఐ నిర్మాణ మహాసభకు భిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి పౌరులందరి బ్యాంక్ ఖాతాల్లో రూ.15 లక్షలు చొప్పున జమ చేస్తానని, తదితర అనేక హామీలు గుప్పించిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఉద్యోగ ఖాళీల భర్తీ, తదితర అనేక హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలుగా ఇస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదంతో అధికారాన్ని మళ్లీ చేజిక్కించుకునే కుట్రలకు తెగబడుతోందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, తదితరాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసపూరిత పాలన సాగిస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠం చెప్పేలా ప్రజలను ఐక్య పోరాటాల దిశగా నడిపించేలా చైతన్యయుత కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులకు సూచించారు. అనంతరం ఆ పార్టీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నకిరే ఓదెలు, సహాయ కార్యదర్శులుగా జక్కు రాజుగౌడ్, బొజ్జం లక్ష్మీ, కోశాధికారిగా జేరిపోతుల లచ్చన్న, సభ్యులుగా 17 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శిరీష, నవాబ్, ప్రసాద్, మహేందర్, ఇసంపల్లి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించండి



మొక్కలు నాటుతున్న పాస్టర్ అనిల్‌కుమార్

శాయంపేట : సమాజంలోని ప్రతీఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సీఎస్ఐ చర్చి పాస్టర్ డి.అనిల్‌కుమార్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఆ చర్చి ఆవరణలో 'సండే ప్లాంటేషన్' పేరుతో ఆయన ఆధ్వర్యంలో క్రైస్తవులు, దైవజనులు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాస్టర్ అనిల్‌కుమార్ మాట్లాడారు. మానవ మనుగడకు బాటలు వేసే దిశగా సండే ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పేదలకు సేవలు అందించడం, శాంతియుత సమాజ నిర్మాణానికి బాటలు వేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం సైతం క్రైస్తవులు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండల ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణాన్ని పొందేలా యేసుక్రీస్తును ప్రార్థించడంతోపాటు ఆదివారాల్లో సమాజ హిత కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో చర్చి కమిటీ కార్యదర్శి బొచ్చు పాల్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు: మైనార్టీల అభ్యున్నతికి బీఆర్ఎస్ సర్కారు పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని తన నివాసగృహంలో ఆదివారం నియోజకవర్గంలోని 13 మంది మైనార్టీ లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ సర్కారు రూ.15వేల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో హౌజుబుజుర్గు సర్పంచ్ ఎస్‌కె.రబియాబీ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు మార్క రజనీకర్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

'చల్లా' చొరవతో అభివృద్ధి, సంక్షేమం

● మద్దతు ప్రకటించిన ఉద్యమకారులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యమకారులు

ఆత్మకూరు : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతోనే పరకాల నియోజకవర్గంలో అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి బాటలు పడుతున్నాయని తెలంగాణ ఉద్యమకారులు కాలం సాంబరెడ్డి, పెరుమాండ్ల అనిల్ తెలిపారు. మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఎమ్మెల్యే ధర్మారెడ్డిని హనుమకొండలోని అతడి నివాసంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యమకారులు మాట్లాడారు. చల్లా ధర్మారెడ్డికే తమ మద్దతు ఉంటుందని, ఆయన నాయకత్వంలోనే పని చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలోనూ ఎమ్మెల్యే ధర్మారెడ్డి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు, గిట్టని వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు, తెలంగాణ ఉద్యమకారులు ఎమ్మెల్యే ధర్మారెడ్డి వెన్నంటే ఉండి రానున్న ఎన్నికల్లో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. మండలంలోని ప్రజాసమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే దిశగా చొరవ తీసుకుంటానని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. తాను నియోజకవర్గ ప్రజలకు, ఉద్యమకారులకు ఎళ్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉద్యమకారులు ఒడ్డెపెల్లి నర్సయ్య, గొని రాజు, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వంగాల స్వాతి భగవాన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాపని రవీందర్ పాల్గొన్నారు.

'భూఆక్రమణదారుడిపై చర్య తీసుకోవాలి'



విలేకరులతో మాట్లాడుతున్న కొటం అయిలయ్య

దామెర : తన భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన రైతు కొటం అయిలయ్య ప్రభుత్వాన్ని, పోలీసు శాఖ ఉన్నతాధికారులను కోరాడు. మండలంలోని ఊరుగొండ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరుగొండలోని సర్వే నంబర్ 118లో తనకున్న 2.20 ఎకరాల భూమిలోని 4 గుంటల భూమిని చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆక్రమించినట్లు తెలిపాడు. శ్రీనివాస్‌రెడ్డి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. సర్వే నంబర్ 103లోని చెరువు శిఖం భూమి (ఎఫ్‌టీఎల్)ని ఆక్రమించాడని తెలిపాడు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. శ్రీనివాస్‌రెడ్డి భూమి నుంచి వర్షం నీరు వెళ్లేలా ఉన్న నాలాను అక్రమంగా మూసేసి తన భూమిలో తాను నిర్మించుకున్న ప్రహరీని కూల్చడంతోపాటు మూడు ఫీట్ల బేస్‌మెంట్‌ను, ప్రహరీని ధ్వంసం చేశాడన్నాడు. ఈ క్రమంలో వరదనీరు తన భూమిలో నుంచి వెళ్తుండడంతో తనకు సుమారు రూ.20 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని వివరించారు. గ్రామంలో శ్రీనివాస్‌రెడ్డి ఆగడాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఇకనైనా రెవెన్యూ, పోలీసు శాఖల ఉన్నతాధికారులు స్పందించి శ్రీనివాస్‌రెడ్డి ఆగడాలపై సమగ్ర విచారణ చేపట్టి ఆక్రమణకు గురైన తన భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

జహీరుద్దీన్‌కు జర్నలిస్టుల నివాళి



జహీరుద్దీన్‌కు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

నయీంనగర్: ఇటీవల మృతి చెందిన సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్‌కు జర్నలిస్టులు నివాళులర్పించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ అధ్యక్షతన జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జహీరుద్దీన్ చిత్రపటానికి ఆయన కుటుంబ సభ్యులు, ప్రెస్ క్లబ్, టీయూడబ్ల్యూజే నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సియాసత్ న్యూస్ ఎడిటర్ అమెర అలీఖాన్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం జహీరుద్దీన్ నిరంతరం తపించేవారని గుర్తుచేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి జహీరుద్దీన్ ఎంతో కృషి చేశారన్నారు. వరంగల్ శాంతి సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనీష్ సిద్దీఖీ, వరంగల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, జహీరుద్దీన్ అలీఖాన్ కుమారులు ఫకృద్దీన్ అలీఖాన్, అష్టర్ అలీఖాన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సముచిత స్థానం కోసమే 'యుద్ధభేరి'

కమలాపూర్ : రానున్న ఎన్నికల్లో యాదవులకు, ఉపకులాలకు సముచిత స్థానం సాధించడం కోసమే ఈనెల 25న యాదవ యుద్ధభేరి నిర్వహించనున్నట్టు యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి పాక కుమారస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేయాలని, యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయించాలని, ఎస్ఎస్టీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని, తదితర డిమాండ్లతో హైదరాబాద్‌లోని నాగోల్ సమీపంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో తలపెట్టిన యాదవ యుద్ధభేరికి కులస్తులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యాదవ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమానత్వం సాధించే దిశగా తలపెట్టిన పోరాటానికి కలిసి రావాలని ఆకాంక్షించారు.

మధుసూదనాచారికే టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సారయ్య

శాయంపేట : రానున్న ఎన్నికల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారికే భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు పల్లెబోయిన సారయ్య అధిష్టానాన్ని, పార్టీ జిల్లా అధ్యక్షుడిని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సారయ్య మాట్లాడారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మధుసూదనాచారి భూపాలపల్లి నుంచి గెలిచి రాష్ట్ర తొలి శాసన సభాపతిగా నియమితులై ప్రజలకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. భూపాలపల్లిని అనతికాలంలోనే అత్యద్భుతంగా అభివృద్ధి చేసిన ఘనత మధుసూదనాచారి సొంతమన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ మధుసూదనాచారికే బీఆర్ఎస్ టికెట్ రావాలని ఆశిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా మధుసూదనాచారి ఖచ్చితంగా గెలుస్తారని స్పష్టం చేశారు. ప్రజాకాంక్ష, స్థానిక పరిస్థితుల నేపథ్యంలో పార్టీ అధిష్టానం స్పందించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి టికెట్ ఇస్తే ఓటమి ఖాయమన్నారు. గండ్రకు నియోజకవర్గ ప్రజల్లో వ్యతిరేకత ఉందని తెలిపారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తెలంగాణ ఉద్యమకారులను విస్మరించి అగ్రవర్ణ ఆధిపత్యం చెలాయిస్తున్నాడని ఆరోపించారు. సమావేశంలో ఉద్యమకారులు కొత్తగట్టు సాయికృష్ణ, అరికిల్ల విజయ్, నమతబాజి అశోక్, ఆకాష్, సునిల్, సాంబమూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన జక్కుల రమేష్ మృతదేహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉప్పల్, నేరెళ్ల గ్రామాలను ఆయన సందర్శించి పలు కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న విష్ణు, తదితరులు

దామెర : మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన మంద వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందగా అతడి మృతదేహానికి సూర్య ట్రస్ట్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని విష్ణు ఓదార్చి రూ.5 వేల సాయం అందించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. విష్ణు వెంట అమ్మ కుమరస్వామి, మంద మహేందర్, సతీష్, పరికరాల మధు, గజ్జి నర్సింగం, వడ్డెపల్లి రాజేందర్ బాబు తదితరులున్నారు.

పరామర్శ



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న కీర్తి

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన గాజర్ల సౌందర్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తి సత్యపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

హన్మకొండ చౌరస్తా: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిరుధాన్యాల (మిల్లెట్స్)తో తయారుచేసిన ఆహార పదార్థాలను అందించాలని, తద్వారా వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కరీంనగర్ పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ సుంకర శ్రీనివాస్ తెలిపారు. ప్రగళ్లపాటి ప్రకాశం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'చిరుధాన్యాలు (మిల్లెట్స్) - ప్రయోజనాలు' అనే అంశంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ 4వ డివిజన్ పరిధి రెడ్డికాలనీలోని వికాస్ మాస్టర్జీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ నేటితరం పిల్లల్లో అనేక మంది ఊబకాయంతో పాటు బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. అందుకు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడమే కారణమని వివరించారు. కార్యక్రమంలో ప్రగళ్లపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజ్‌కుమార్, బాధ్యులు రేవతి, భూపాలపల్లి పోలీస్ అధికారి ఆర్.రమేష్, డీఎస్పీ విజయ్‌కుమార్, సింగరేణి రిటైర్డ్ ఈఈ ప్రభాకర్‌రావు, రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం, పర్యావరణ శాస్త్రవేత్త రవిబాబు, నారాయణగిరి రాజు, కొక్కెర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఖిలా వరంగల్ : కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలి నియోజకవర్గ ఎమ్మెల్యే సంజీవ్ అగర్వాల్ సూచించారు. వరంగల్ ఇసుక అడ్డా జంక్షన్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో ఆ పార్టీ వరంగల్ తూర్పునియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే సంజీవ్ మాట్లాడారు.